సాక్షి
జయశంకర్ భూపాలపల్లి

శుక్రవారం । 28 । జూన్ । 2024



వస్త్ర నగరికి మహర్దశ పట్టేనా!
టెక్స్‌టైల్ పార్కు నిర్మాణానికి రూ.కోట్లలో నిధులు కావాల్సి ఉంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి తగినన్ని నిధులు కేటాయించాలని ప్రజలు కోరుతున్నారు. - 8లో▸



వనదేవతల కానుకల లెక్కింపు
సమ్మక్క, సారలమ్మ వనదేవతల హుండీల కానుకలను గురువారం మేడారంలోని దేవాదాయశాఖ కార్యాలయం డార్మెటరీ భవనంలో లెక్కించారు. - 8లో▸

గరిష్టం/కనిష్టం
31.1°/26.2°

వాతావరణం
జిల్లాలో ఉదయం వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. ఆకాశం మేఘావృతమై మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

'నీట్' రద్దు చేయాలి



భూపాలపల్లి అర్బన్: నీట్, ఎన్‌టీఏను రద్దుచేయాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ విద్యా పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో గురువారం జిల్లాకేంద్రంలోని అంబేడ్కర్ సెంటర్‌లో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా విద్యా పరిరక్షణ కమిటీ సభ్యులు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నీట్, యూజీసీ పరీక్షల్లో తీవ్రమైన అవకతవకలకు పాల్పడిన అధికారులను సస్పెండ్ చేయాలన్నారు. కేంద్రీకృత పరీక్షలను రద్దుచేసి ఇంతకుముందు మాదిరిగా రాష్ట్ర ప్రభుత్వాలకు, యూనివర్సిటీలకు అప్పగించాలని డిమాండ్‌చేశారు. జాతీయ విద్యావిధానం రాష్ట్ర ప్రభుత్వం తిరస్కరించి రాష్ట్ర అవసరాలకు అనుగుణంగా ఒక విద్యా విధానాన్ని తయారు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు రమణారెడ్డి, సేవానాయక్, జగపతిరావు, తిరుపతి, వీరేశం, సమ్మన్న, తిరుపతిరెడ్డి, ప్రభాకర్, మధు పాల్గొన్నారు.

ఓసీ-3లో భారీపేలుళ్లు



భూపాలపల్లి రూరల్: భూపాలపల్లి మండలం గుర్రంపేట సమీపంలోని ఓసీ-3లో బొగ్గు తవ్వడం కోసం చేసిన పేలుళ్లతో గురువారం గుర్రంపేట గ్రామ సమీపంలోని కడియాల రమేష్‌పై బొగ్గుపెళ్ల పడింది. దీంతో రమేష్‌కు స్వల్పంగా గాయమైంది. సింగరేణి అధికారులు నిబంధనలకు విరుద్ధంగా ఎక్కువ మోతాదులో మందుగుండు సామగ్రితో బొగ్గు కోసం పేల్చుతున్నారని గ్రామస్తులు వాపోతున్నారు. గ్రామస్తులను ఓసీ నుంచి సురక్షిత ప్రాంతాలకు తరలించే ఏర్పాటుచేయాలని సింగరేణి అధికారులను, ప్రభుత్వాన్ని గ్రామస్తులు కోరుతున్నారు.

బెటాలియన్ కమాండెంట్‌గా అలెక్స్



గోవిందరావుపేట: మండల పరిధిలోని చల్వాయిలో గల తెలంగాణ స్పెషల్ పోలీస్ 5వ బెటాలియన్ కమాండెంట్‌గా టి. అలెక్స్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇన్‌చార్జ్ కమాండెంట్‌గా వ్యవహరిస్తున్న డి.శివప్రసాద్ రెడ్డి నుంచి ఆయన పూర్తి బాధ్యతలు తీసుకున్నారు. ఈ సందర్భంగా అలెక్స్ బెటాలియన్ అధికారులతో మాట్లాడుతూ సిబ్బంది విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కమాండెంట్ ఎన్.పెద్దబాబు, అసిస్టెంట్ కమాండెంట్ అనిల్ కుమార్, వేణు గోపాల్ రెడ్డి, ఆర్‌ఐ కార్తీక్, సల్మాన్ రాజు, శ్రీనివాస్‌లు, రాంప్రసాద్, ఆర్ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడా పాఠశాల ఎంపిక స్థల మార్పిడి

ములుగు రూరల్: క్రీడా పాఠశాలలో 4వ తరగతిలో ప్రవేశం కోసం విద్యార్థులను ఎంపిక చేసే స్థలాన్ని మార్పిడి చేసినట్లు ములుగు జిల్లా యువజన, క్రీడల ఇన్‌చార్జ్ అధికారి తుల రవి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో జిల్లా కేంద్రంలోని తంగేడు స్టేడియాన్ని కేటాయించగా వర్షాల కారణంగా ప్రస్తుతం జాకారం సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలకు స్థలాన్ని మార్చినట్లు వివరించారు. మండల స్థాయిలో ఎంపికైన విద్యార్థులు నేడు, రేపు నిర్వహించే ఎంపికకు జాకారం గురుకుల పాఠశాలకు హాజరు కావాలని సూచించారు. వివరాలకు సెల్ నంబర్ 9849011113, 7330326241లలో సంప్రదించాలని కోరారు.

విద్యార్థులు ప్రశ్నించేతత్వాన్ని అలవర్చుకోవాలి

ములుగు రూరల్: విద్యార్థులు ప్రశ్నించేతత్వాన్ని అలవర్చుకోవాలని డెమోక్రటిక్ స్టూడెంట్ అసోసియేషన్ ములుగు జిల్లా అధ్యక్షుడు జక్కుల శరత్ అన్నారు. ఈ మేరకు గురువారం అసోసియేషన్ ఆధ్వర్యంలో స్టూడెంట్స్ అవేర్‌నెస్ ఆన్ సొసైటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు కళాశాలల్లో ఎదురయ్యే సమస్యలపై ప్రశ్నించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యా వ్యవస్థపై చిన్న చూపు చూస్తుందన్నారు. సమాజంలో మహిళలపై జరుగుతున్న అరాచకాలను ప్రభుత్వం నియంత్రించేందుకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. విద్యార్థులకు అండగా అసోసియేషన్ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని వివరించారు.

సాయమేది?



పెట్టుబడి కోసం కౌలురైతుల ఎదురుచూపు

- జిల్లాలో సుమారు 35వేల మంది..
- కౌలు రైతుల గుర్తింపులో స్పష్టత కరువు
- కాంగ్రెస్ ఆరు గ్యారంటీల్లో హామీ..



పిల్లోనిపల్లిలో పత్తి చేనులో గుంటుక తోలుతున్న రైతు

భూపాలపల్లి రూరల్: వానాకాలం సీజన్ ప్రారంభం కావడంతో కౌలు రైతులు పెట్టుబడి సాయం కోసం ఎదురుచూస్తున్నారు. కౌలు రైతులకు సైతం ఎకరానికి పెట్టుబడి సాయం కింద రూ.15వేలు ఇస్తామని కాంగ్రెస్ ఆరు గ్యారంటీల్లో హామీ ఇచ్చింది. అధికారంలోకి వచ్చి ఏడు నెలలు అవుతుండడంతో హామీ నెరవేరుతుందనే ఆశలో కౌలు రైతులు ఉన్నారు.

జిల్లాలో సుమారు 35వేల మంది కౌలు రైతులు ఉన్నట్లు 2016లో ప్రభుత్వం నిర్వహించిన సర్వేలో తేలింది. అరెకరం భూమి ఉన్న రైతులు ప్రతిఏటా తమకున్న కొద్దిపాటి భూమితో పాటు ఇతరుల పొలాలు కౌలుకు తీసుకొని సాగు చేస్తున్నారు. పత్తి, మిర్చి తోటలకు ఎకరాకు కౌలు రూ.15వేల నుంచి రూ.20వేల వరకు చెల్లిస్తున్నారు. వరి పొలాలకు రూ.12వేల వరకు చెల్లిస్తున్నారు. పంట చేతికొచ్చినా, రాకపోయినా కౌలు మాత్రం చెల్లించాల్సి వస్తోంది. సాగుకు కావాల్సిన, విత్తనాలు, ఎరువులు, కూలీల ఖర్చులు రోజురోజుకూ పెరిగిపోతున్నాయి. దీంతో కౌలు, చిన్న, సన్నకారు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం రైతు భరోసాలో భాగంగా కౌలురైతులకు పెట్టుబడి సాయం అందిస్తే తమకు ఎంతో ఆసరాగా ఉంటుందని అంటున్నారు.

ఎలా గుర్తించాలో స్పష్టత కరువు..

ఇప్పటికే జిల్లాలో వానాకాలం సాగు షురూ అయింది. ప్రస్తుతం ప్రభుత్వం వద్ద పట్టాదారులకు సంబంధించిన వివరాలే ఉన్నాయి. కౌలు రైతుల వివరాలు లేవు. అసలు వీరిని ఎలా గుర్తించాలనే దానిపై స్పష్టత లేదు. జిల్లాలో కౌలు రైతులతో పాటు సన్న, చిన్నకారు రైతులు కలిపి సుమారు 35వేలకు పైగా ఉన్నారు. వీరు రైతు భరోసా కింద పెట్టుబడి సాయం వస్తుందని ఆశిస్తున్నారు. జిల్లాలో ఏటా 1,16,187 మంది రైతులకు పెట్టుబడి సాయం కింద రూ.117.90 కోట్లు అందుతున్నాయి. కౌలు రైతులకు కూడా ఈ సాయం అందిస్తే సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది.

రైతు భరోసా అందించాలి..



నాకున్న రెండెకరాలతో పాటు మరో రెండెకరాలు కౌలు తీసుకుని సాగుచేస్తున్న. ఓ ఏడాది పంటలు సక్కగా పండితే లాభం.. లేకుంటే నష్టం వస్తుంది. నాకు వేరే పని తెలివదు. లాభం వచ్చినా, నష్టం వచ్చినా ఎవుసం చేసుడే తెలుసు. ప్రభుత్వం పట్టాదారు రైతులతో పాటు కౌలు రైతులకు కూడా రైతు భరోసా కింద పెట్టుబడి సాయం అందిస్తే కొంత మేర ఆర్థిక భారం తగ్గుతుంది.
- పిల్లి ఐలయ్య, పిల్లోనిపల్లె, భూపాలపల్లి

బ్యాంకుల నుంచి రుణాలు ఇప్పించాలి..



ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీ ప్రకారం పట్టాదారులకు అందజేసే సమయంలోనే కౌలు రైతులకు కూడా పెట్టుబడి సాయం అందించాలి. రైతు భరోసా అందిస్తే కౌలు రైతులకు ఉపయోగంగా ఉంటుంది. కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇచ్చి రైతు బీమా సౌకర్యం కల్పించాలి.
- కర్నాటకపు సమ్మయ్య, రైతు స్వరాజ్యవేదిక జిల్లా కన్వీనర్

సీఎం నేటి వరంగల్ పర్యటన వాయిదా

- రేపు రానున్న రేవంత్‌రెడ్డి
- ఢిల్లీ పర్యటన ముగియకపోవడంతో చివరి నిమిషంలో మార్పు



సాక్షిప్రతినిధి, వరంగల్: ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి వరంగల్ పర్యటన ఒకరోజు తరువాత వాయిదా పడింది. సీఎం అయ్యాక తొలిసారిగా శుక్రవారం వరంగల్, హనుమకొండ జిల్లాల్లో పర్యటించనున్నట్లు గురువారం సాయంత్రం అధికారిక టూర్ షెడ్యూల్ విడుదల చేశారు. కానీ ఆయన ఢిల్లీ పర్యటన ముగియకపోవడం, శుక్రవారం అక్కడే ఉండాల్సి ఉండడంతో చివరి నిమిషంలో వరంగల్ పర్యటన వాయిదా వేశారు. శనివారం ఆయన పర్యటన యధావిధిగా కొనసాగుతుందని కాంగ్రెస్ వర్గాలు తెలిపాయి. అంతకుముందు సీఎం పర్యటన ఏర్పాట్లకు సంబంధించి రాష్ట్ర మంత్రులు కొండా సురేఖ, సీతక్క, మేయర్ గుండు సుధారాణి, ఎమ్మెల్యేలు గురువారం సాయంత్రం జిల్లా ఉన్నతాధికారులతో సమావేశం నిర్వహించారు. అధికారులకు దిశానిర్దేశం చేశారు. అదేవిధంగా వరంగల్ కలెక్టర్ సత్య శారదాదేవి కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులతో సమీక్షించారు. గీసుగొండ మండలం శాయంపేటలోని మెగా టెక్స్‌టైల్ పార్క్ సమీపంలో హెలిపాడ్ నిర్మాణంతోపాటు జరుగుతున్న ఏర్పాట్లను అడిగి తెలుసుకున్నారు. గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు మహిళా శక్తి పథకం కింద మహిళలకు సీఎం చేతుల మీదుగా అందించనున్న చెక్కులకు తగిన ఏర్పాట్లు చేయాలని, కొత్తగా నిర్మాణంలో ఉన్న హెల్త్ సిటీ సందర్శనకు సంబంధించిన వివరాలు సిద్ధంగా ఉంచాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, ఆర్డీఓ శ్రీనివాస్, జెడ్పీ సీఈఓ రాంరెడ్డి, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు. అంతకుముందు మెగా టెక్స్‌టైల్ పార్క్‌లోని ఏర్పాట్లను కలెక్టర్, సీపీ అంబర్ కిషోర్ ఝా పరిశీలించారు. భద్రతపై సీపీ సంబంధిత సిబ్బందికి సూచనలు చేశారు.

33మందికి జైలుశిక్ష



చిట్యాల: చిట్యాల సర్కిల్ పరిధిలోని చిట్యాల, టేకుమట్ల, మొగుళ్లపల్లి, రేగొండ, గణపురం మండలాలలో వివిధ కేసులలో నేరారోపణలు ఎదుర్కొంటున్న 33మంది నిందితులకు భూపాలపల్లి మేజిస్ట్రేట్ ఎస్.రామచంద్రారావు జైలు శిక్ష విధించినట్లు చిట్యాల సీఐ మల్లేష్ తెలిపారు. భూపాలపల్లి కోర్టులో వాయిదాలకు సరైన సమయంలో హాజరుకాని వారిపై మేజిస్ట్రేట్ ఎస్.రామచంద్రారావు నాన్ బెయిలబుల్ వారెంట్లు జారీ చేశారని పేర్కొన్నారు. ఎస్పీ కిరణ్‌ఖరే ఆదేశాల మేరకు స్పెషల్ డ్రైవ్ చేపట్టి నాన్ బెయిలబుల్ వారెంట్లు జారీఅయిన 33మంది నిందితులను కోర్టులో హాజరుపర్చగా వారికి గురువారం భూపాలపల్లి కోర్టు జడ్జి ఉత్తర్వుల ప్రకారం ఖమ్మం జైలుకు తరలించినట్లు సీఐ తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నిందారోపణలు ఎదుర్కొంటున్న వారు కోర్టు నిర్దేశించిన సమయానికి కోర్టులో హాజరై విచారణకు తప్పనిసరిగా సహకరించాలని కోరారు. లేనిపక్షంలో నాన్ బెయిలబుల్ వారంటీ జారీఅయితే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆయా మండలాలకు చెందిన ఎస్సైలు శ్రావణ్‌కుమార్, ప్రసాద్, అశోక్, రవికుమార్, సాంబమూర్తి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

గంజాయి, గుట్కా విక్రయిస్తే పీడీ యాక్ట్



మహదేవపూర్‌లో తనిఖీ చేస్తున్న డీఎస్పీ, ఎస్సైలు, పోలీసులు



సీజ్ చేసిన ద్విచక్రవాహనాలు

- కాటారం డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి
- మహదేవపూర్ పోలీసుల ఆకస్మిక తనిఖీ

కాళేశ్వరం: గంజాయి, గుట్కా రవాణా చేసినా, విక్రయించినా పీడీ యాక్ట్ నమోదు చేస్తామని కాటారం డీఎస్పీ గడ్డం రామ్మోహన్‌రెడ్డి అన్నారు. గురువారం సాయంత్రం మహదేవపూర్ ఎస్సై పవన్‌కుమార్ ఆధ్వర్యంలో పాత అంగడి బజార్, చౌకీదార్ చౌరస్తా, గడి హనుమాన్ వీధుల్లో ఆకస్మికంగా తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా డీఎస్పీ గ్రామస్తులతో మాట్లాడారు. గంజాయి, గుట్కాలతో జీవితం నాశనం చేసుకోవద్దన్నారు. రవాణా చేసినా, విక్రయాలు జరిపినా, సేవించినా కఠిన చర్యలు తీసుకొని కేసునమోదు చేస్తామని హెచ్చరించారు. మైనర్లకు బైక్‌లు ఇవ్వొద్దని సూచించారు. మైనర్లకు బైక్‌లు ఇస్తే తల్లిదండ్రులపై కేసు నమోదు చేసి జరిమాన వేస్తామన్నారు. రోడ్లపై ర్యాష్ డ్రైవింగ్ చేయవద్దన్నారు. డ్రైవింగ్ లైసెన్స్‌లు లేకుండా వాహనాలు నడుపొద్దని చెప్పారు. రాత్రి వేళల్లో రోడ్లపై యువత మద్యం సేవించి మహిళల పట్ల అసభ్యంగా, అమర్యాదగా, వేధింపులకు గురిచేస్తే కేసు నమోదు చేస్తామన్నారు. కాలేజీ, బస్టాండ్లు, రద్దీ ప్రదేశాల్లో ఈవ్‌టీజింగ్‌కు పాల్పడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించొద్దన్నారు. వృద్ధులను బెదిరింపులకు పాల్పడినా, డబ్బుల కోసం చిత్రహింసలు చేసినా చర్యలు తీసుకుంటామన్నారు. సరైన పత్రాలు లేని 16 ద్విచక్రవాహనాలను పోలీసులు సీజ్ చేసి స్టేషన్‌కు తరలించారు. వారివెంట సీఆర్‌పీఎఫ్, టీఎస్ఎస్‌పీ, సివిల్ పోలీసులు ఉన్నారు.

తహసీల్దార్ కార్యాలయాల్లో ప్రజావాణి

కలెక్టర్ రాహుల్‌శర్మ



తహసీల్దార్లతో సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్

భూపాలపల్లి అర్బన్: జిల్లావ్యాప్తంగా తహసీల్దార్ కార్యాలయాల్లో ప్రతీ సోమవారం ప్రజావాణి నిర్వహించాలని కలెక్టర్ రాహుల్‌శర్మ తహసీల్దార్లను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని మినీ సమావేశపు హాలులో గురువారం తహసీల్దార్లతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. తహసీల్దార్ కార్యాలయంలో ప్రజావాణి హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేయాలన్నారు. భూ సమస్యలకు ధరణిలో ఏ మాడ్యూల్‌లో దరఖాస్తు చేయాలో ప్రజలకు అవగాహన కల్పించాలని చెప్పారు. అవగాహన కల్పించడానికి హెల్ప్‌డెస్క్‌లో సహాయకులను కేటాయించాలని సూచించారు. మీ సేవ ద్వారా వచ్చిన దరఖాస్తులు పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలని అన్నారు. పెండింగ్ వల్ల ప్రజలకు ఇబ్బంది కలుగుతుందని సకాలంలో పరిష్కరించాలని ఆదేశించారు. మీ సేవ, ప్రజావాణి హెల్ప్ డెస్క్‌ల్లో దరఖాస్తులు ఏ విధంగా చేయాలో సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. భూ సంబంధిత సమస్యలపై దరఖాస్తులు ఎక్కువగా వస్తున్నాయని.. ఆ దరఖాస్తులను ఆయా మండలాల్లోనే పరిష్కరించే విధంగా తహసీల్దార్లు చర్యలు తీసుకోవాలని స్పష్టంచేశారు. హైదరాబాద్ ప్రజాభవన్ నుంచి జిల్లాకు సిఫారసు చేసిన దరఖాస్తులు 135 ఉన్నాయని.. వాటి పరిష్కారానికి చర్యలు చేపట్టి పోర్టల్ అప్ లోడ్ చేయాలని సూచించారు. సమస్య పరిష్కారంపై తప్పనిసరిగా దరఖాస్తుదారుడికి లిఖితపూర్వకంగా సమాధానం ఇవ్వాలన్నారు. మండలాల వారీగా ధరణి, మీ సేవ దరఖాస్తులు పెండింగ్ వివరాలను అడిగి తెలుసుకున్న కలెక్టర్ రెండు రోజుల్లో దరఖాస్తుల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడీ దేవరాజ్, సబ్ రిజిస్ట్రార్ రంజిత్, ఆర్డీఓ మంగీలాల్, అన్ని మండలాల తహసీల్దార్లు పాల్గొన్నారు.

ఉపాధి హామీతో స్వచ్ఛ గ్రామాలు

ఉపాధి హామీ పనులతో గ్రామాలను స్వచ్ఛ గ్రామ పంచాయతీలుగా తీర్చిదిద్దాలని కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో పలు శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ.. ఉపాధి హామీ కూలీలకు సరైన పనిదినాలు కల్పించి గ్రామాల అభివృద్ధికి పనులను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. జూలై 1వ తేదీ నుంచి వనమహోత్సవం కార్యక్రమం ప్రారంభం కాబోతుందని.. దానికి అనుగుణంగా మొక్కలు నాటేందుకు ఏర్పాట్లు చేయాలన్నారు. జూలై 15వరకు విద్యార్థులందరికీ యూనిఫాంల పంపిణీ పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయడానికి ప్రభుత్వం మహిళా శక్తి కార్యక్రమాన్ని తీసుకొచ్చిందని చెప్పారు. మిషన్ భగీరథ సర్వే పారదర్శకంగా నిర్వహించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో జరుగుతున్న పనులను త్వరితగతిన పూర్తిచేయాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, జెడ్పీ సీఈఓ విజయలక్ష్మి, డీపీఓ నారాయణరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ నిర్మల, డీఈఓ రాంకుమార్, పంచాయతీరాజ్ ఈఈలు పాల్గొన్నారు.



సమీక్షకు హాజరైన అధికారులు

జిల్లాను అభివృద్ధిలో ముందుంచేందుకు కృషి

భూపాలపల్లి రూరల్: జిల్లాను అభివృద్ధిలో అగ్రగామిగా ముందుంచేందుకు కృషిచేస్తానని కలెక్టర్ రాహుల్‌శర్మ అన్నారు. గురువారం ఐడీఓసీ కార్యాలయపు సమావేశపు హాలులో మీడియాతో పరిచయ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మీడియా, ప్రజలు, ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ సిబ్బంది సహకారంతో విద్య, వైద్యం, వ్యవసాయ రంగాల్లో గణనీయమైన మార్పు తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీపీఆర్‌ఓ శ్రీనివాస్, డీపీఆర్‌ఓ కార్యాయం సిబ్బంది పాల్గొన్నారు.

పెద్దంపేటలో విషజ్వరాలు



పెద్దంపేటలో వైద్యపరీక్షలు చేస్తున్న సిబ్బంది

కాళేశ్వరం: కలుషిత నీరు తాగి మహదేవపూర్ మండలం పెద్దంపేట గ్రామంలో ప్రజలు విషజ్వరాల భారిన పడుతున్నారు. 15 రోజులుగా విషజ్వరాలు ప్రబలి ఇంటికొకరు మంచానపడుతున్నారు. బాధితులు కాటారం, భూపాలపల్లి, వరంగల్ ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రుల్లో వైద్యసేవలు పొందుతున్నారు. ప్రైవేట్‌కు వెళ్లి జేబులు గుల్ల చేసుకుంటున్నారు. పెద్దంపేట గ్రామంలో వైద్యారోగ్యశాఖ అధికారులు వైద్యసేవల అందించడంలో అలసత్వం ప్రదర్శిస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు.

వైద్యబృందాల పరీక్షలు..

డీఎంహెచ్ఓ ఆదేశాలతో ఎట్టకేలకు వైద్యబృందాలు పెద్దంపేటలో గురువారం పర్యటించాయి. కలుషిత నీటిని తాగడం వల్ల జ్వరాలు, జాండీస్, లివర్ సమస్యలు వస్తున్నట్లు గుర్తించారు. దోమలు వ్యాప్తి చెందకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కలుషితమైన నీటిని తాగొద్దని, కాచిచల్లార్చిన నీటిని తాగాలని గ్రామస్తులకు వివరించారు. జాండీస్‌తో బాధపడుతున్న రోగులను పరీక్షించి మలేరియా, ఆర్‌డీటీ పరీక్షలు చేయగా వారికి నెగిటివ్ వచ్చినట్లు తెలిపారు. వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. ఈకార్యక్రమంలో వైద్యాధికారి పూజెం రామారావు తదితరులు ఉన్నారు.

మావోయిస్టులకు ఆశ్రయం ఇవ్వొద్దు



ముసలమ్మగుట్ట గొత్తికోయగూడెం గిరిజనులతో మాట్లాడుతున్న ఎస్పీ శబరీశ్

మంగపేట: మావోయిస్టులకు ఆశ్రయం ఇవ్వొద్దని ఎస్పీ శబరీశ్ హెచ్చరించారు. మండల పరిధిలోని తిమ్మాపురం సమీపంలోని ముసలమ్మగుట్ట అటవీ ప్రాంతంలో గల పిట్టతోగు వద్ద నివాసం ఉంటున్న గొత్తికోయగూడాన్ని ఎస్పీ గురువారం సందర్శించారు. గూడెంలోని గిరిజనులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. ప్రధానంగా వర్షాకాలంలో తాగునీరు, దోమలతో ఇబ్బంది పడుతున్నామని ఎస్పీకి తెలిపారు. తాగునీటి సమస్య పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని, దోమల బెడద నివారణకు దోమతెరలు అందజేస్తామని తెలిపారు. అదేవిధంగా మలేరియా, డెంగీ, సీజనల్ వ్యాధుల బారిన పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవడంతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. పిల్లలపై జాగ్రత్తలు తీసుకోవడంతో పాటు గర్భిణులు, ముసలివారు అనారోగ్యం బారిన పడితే స్థానిక సీఐ, ఎస్సైలకు తెలుపాలన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి



ఆర్ఓ ప్లాంట్‌ను పరిశీలిస్తున్న ఏటీడీఓ దేశిరాం

ఏటూరునాగారం: కన్నాయిగూడెం మండల పరిధిలోని ఐలాపురం గ్రామం, ఆశ్రమ పాఠశాలలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఐటీడీఏ ఈఈ వీరభద్రం, ఏటీడీఓ దేశిరాం అన్నారు. గ్రామంలో వారు గురువారం పర్యటించి గ్రామస్తులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆశ్రమ పాఠశాల పైకప్పు శిథిలమై ఉండడంతో పాటు పెచ్చులూడిపడుతున్నాయని తెలిపారు. ఆర్ఓ ప్లాంట్ మరమ్మతు ఉందన్నారు. విద్యుత్, తాగునీరు, మరుగుదొడ్లు, ఇతర సౌకర్యాలను విద్యార్థులకు కల్పించే విధంగా చూస్తామన్నారు. ఐటీడీఏ పీఓ చిత్రామిశ్రా ఆదేశాల మేరకు గ్రామాన్ని, పాఠశాలను సందర్శించినట్లు వెల్లడించారు. అలాగే ఐలాపురం గ్రామానికి వెళ్లే రోడ్డు మార్గంలో ఉన్న ఇబ్బందులు సైతం నోట్ చేసుకున్నట్లు తెలిపారు. వారి వెంట మాజీ సర్పంచ్ మల్లెల లక్ష్మయ్య, డీఈ చందర్ తదితరులు పాల్గొన్నారు.

అందరికీ వైద్యసేవలు అందేలా చూడాలి

ఏరియా ఆస్పత్రిని తనిఖీ చేసిన కేంద్ర బృందం



ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ జగదీశ్వర్‌తో మాట్లాడుతున్న సెంట్రల్ టీం సభ్యులు

ములుగు: ప్రతీఒక్కరికి ఆరోగ్య సేవలు అందేలా చూడాలని సెంట్రల్ టీం సభ్యురాలు, సీనియర్ రీజినల్ డైరెక్టర్ డాక్టర్ అనురాధ మెడోజు అన్నారు. ఈ మేరకు గురువారం డాక్టర్ పర్వీన్ సుల్తానాతో కలిసి ములుగు జిల్లాలో జాతీయ ఆరోగ్య మిషన్, ఎన్‌హెచ్ఎం తరఫున అమలు అవుతున్న జాతీయ కార్యక్రమాలను పరిశీలనలో భాగంగా తొలిరోజు గురువారం ములుగు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయానికి చేరుకొని సంబంధిత శాఖల ప్రోగ్రాం ఆఫీసర్లు పోరిక రవీందర్, పవన్, శ్రీకాంత్, రణధీర్, అసిస్టెంట్ మలేరియా ఆఫీసర్లు దుర్గారావు, సాంబయ్యలతో జాతీయ ఆరోగ్య కార్యక్రమాలపై చర్చించారు. జిల్లాలో కీటక జనిత వ్యాధులైన మలేరియా, పైలేరియా, డెంగీ నియంత్రణకు తీసుకుంటున్న జాగ్రత్తల తీరును అడిగి తెలుసుకున్నారు. అనంతరం జిల్లా కేంద్రంలోని ఏరియా ఆస్పత్రిని సందర్శించి చికిత్స పొందుతున్న వారితో మాట్లాడి అందుతున్న వైద్యంపై వివరాలను సేకరించారు. సూపరింటెండెంట్ డాక్టర్ జగదీశ్వర్‌తో కలిసి మాతాశిశు సంరక్షణ కార్యక్రమాలు, ఆస్పత్రిలో జరుగుతున్న కాన్పులు, నవజాత శిశు సంరక్షణ కేంద్రంలో అందిస్తున్న సౌకర్యాలు, ఐసీయూ వార్డు, బ్లడ్ బ్యాంకు, సైకియాట్రిస్టు సేవలపై ఆరా తీశారు. దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు అందిస్తున్న సేవలను డాక్టర్ వినయ్ వివరించారు. అనంతరం గోవిందరావుపేట పీహెచ్‌సీని కేంద్ర బృందం సందర్శించింది. వైద్యులతో కలిసి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మాతాశిశు సంరక్షణ, ప్రసూతి సేవలపై సమీక్ష నిర్వహించారు. పీహెచ్‌సీలోని రికార్డులు, రిపోర్టులను తనిఖీ చేశారు.

క్లుప్తంగా

వనదేవతల కానుకల లెక్కింపు


కానుకలు లెక్కిస్తున్న సిబ్బంది

ఎస్ఎస్‌తాడ్వాయి : వనదేవతలు సమ్మక్క, సారలమ్మల హుండీల కానుకలను గురువారం మేడారంలోని దేవాదాయశాఖ కార్యాలయం డార్మెటరీ భవనంలో లెక్కించారు. దేవాదాయ శాఖ అధికారుల పర్యవేక్షణ.. పూజారుల సమక్షంలో హుండీల కానుకల లెక్కింపు చేపట్టారు. ఇందులో సమ్మక్క హుండీ ఆదాయం రూ. 21,83,867, సారలమ్మ ఆదాయం రూ. 17,58,83, గోవిందరాజు ఆదాయం రూ. 1,13,998, పగిడిద్దరాజు ఆదాయం రూ. 1,54,954 మొత్తం రూ. 42,10,902 లభించినట్లు ఈఓ రాజేంద్రం తెలిపారు. పూజారుల సంఘం అధ్యక్షుడు సిద్దబోయిన జగ్గారావు, ఇన్‌స్పెక్టర్ అనిల్, సూపరింటెండెంట్ క్రాంతికుమార్, పూజారులు వసంతరావు, ప్రధాన పూజారి అరుణ్‌కుమార్, కాక కిరణ్, పూజారుల సంఘం ఉపాధ్యక్షుడు చందా గోపాల్, సిద్దబోయిన భోజరావు పాల్గొన్నారు

విద్యుదాఘాతంతో రైతు మృతి

● తాళ్లపూసపల్లిలో ఘటన


ప్రకాశ్(ఫైల్)

కేసముద్రం: విద్యుదాఘాతంతో ఓ రైతు మృతి చెందాడు. ఈ ఘటన గురువారం మండలంలోని తాళ్లపూసపల్లిలో జరిగింది. ఎస్సై వంశీధర్ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన వాలేరు ప్రకాశ్(48) తన పంట పొలం వద్ద నారుమడికి నీళ్లు పారించేందు స్టార్టర్‌ను ఆన్‌చేయగా మోటార్ నడవలేదు. దీంతో మోటార్‌కు కనెక్షన్ ఉన్న తీగను పరిశీలిస్తున్నాడు. ఈ క్రమంలో అప్పటికే ఫెయిల్ అయిన తీగ అతడి చేతికి తాకింది. దీంతో విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న కుటుంబసభ్యులు హుటాహుటిన ఘటనాస్థలికి చేరుకుని మృతదేహంపై పడి బోరున విలపించారు. పోలీసులు.. ప్రకాశ్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మానుకోట జిల్లా ఆసుపత్రికి తరలించారు. మృతుడికి భార్య సరోజన, ఇద్దరు కుమారులు ఉన్నారు.


పార్కులోని పరిశ్రమలు

వస్త్రనగరికి మహర్దశ పట్టేనా!

టెక్స్‌టైల్ పార్కు అభివృద్ధికి ఇప్పటి వరకు రూ. 706.87 కోట్లు ఖర్చు

- నిధులన్నీ బీఆర్ఎస్ సర్కారు కేటాయించినవే
- ఇప్పటి వరకు నిధులు ఇవ్వని ప్రస్తుత కాంగ్రెస్ సర్కారు
- త్వరలో ప్రవేశపెట్టే రాష్ట్ర బడ్జెట్‌లో కేటాయిస్తే మేలు
- నిధుల మంజూరుపై సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటన చేస్తారనే ఆశ



గణేశా ఎకోటెక్ కంపెనీ

ఓ వైపు.. వస్త్ర ఉత్పత్తి.. మరోవైపు.. చేనేత కార్మికులకు చేతినిండా పని.. ఇంకో వైపు స్థానికులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడమే ధ్యేయంగా గత బీఆర్ఎస్ ప్రభుత్వం కాకతీయ మెగా టెక్స్‌టైల్(వస్త్ర నగరి) పార్కు నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. అయితే ఈ పార్కు అభివృద్ధికి రూ. కోట్లలో నిధులు కావాల్సి ఉంది. అప్పుడే పార్కులో మౌలిక వసతులు ఏర్పాటై నిరుద్యోగులకు ఉద్యోగాలు లభించే అవకాశం ఉంటుంది. దీనిపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి తగినన్ని నిధులు కేటాయించాలని ప్రజలు కోరుతున్నారు.

గీసుకొండ : వరంగల్ జిల్లాలోని గీసుకొండ–సంగెం మండలాల పరిధిలో ఏర్పాటైన కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కు(కేఎంటీపీ) అభివృద్ధికి రూ. కోట్లలో నిధులు కావాల్సి ఉంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తగినంత నిధులు కేటాయిస్తేనే పార్కులో మౌలిక వసతుల కల్పన చేయడానికి, తమ యూనిట్లను నెలకొల్పడానికి వచ్చే వస్త్ర కంపెనీలకు ప్రోత్సాహకాలు ఇవ్వడానికి అవకాశం ఉంటుంది. పలు కంపెనీలు ముందుకు వస్తేనే వస్త్రాల ఉత్పత్తితో పాటు నిరుద్యోగులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయి. 2017 అక్టోబర్ 22న అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్.. పార్కు ఏర్పాటు పనులకు శంకుస్థాపన చేశారు. అప్పట్లో 22 కంపెనీలు తమ యూనిట్లను ఏర్పాటు చేయడానికి ప్రభుత్వంతో ఎంఓయూ కుదుర్చుకున్నాయని అధికారులు తెలిపారు. కరోనా తర్వాత రెండేళ్ల క్రితం నుంచి పనులు పుంజుకున్నాయి. ఉత్తర్‌ప్రదేశ్‌లోని కాన్పూర్ కేంద్రంగా ఉన్న గణేశా ఎకోటెక్ కంపెనీ ముందుగా ఏర్పాటై వినియోగించి పడేసిన ప్లాస్టిక్ నుంచి దారం(యార్న్) తయారు చేస్తోంది. పిల్లల దుస్తుల తయారీకి కేరళ కేంద్రంగా ఉన్న కైటెక్స్ కంపెనీకి అప్పటి మంత్రి కేటీఆర్ 2022 మే 7న శంకుస్థాపన చేశారు. తర్వాత దక్షిణ కొరియాకు చెందిన యంగ్‌వన్ కంపెనీ ఏర్పాటుకు కేటీఆర్ 2023 జూన్ 17న భూమిపూజ చేశారు. ప్రస్తుతానికి ఈ రెండు కంపెనీల నిర్మాణ పనులు వేగంగా సాగుతున్నాయి.

పీఎం మిత్ర నిధులపై ఆశలు..!

ప్రధాని నరేంద్ర మోదీ 2023 మార్చి 17న కేఎంటీపీని 'ప్రధానమంత్రి మెగా ఇంటిగ్రేటెడ్ టెక్స్‌టైల్ రీజియన్ అండ్ అపెరల్ (పీఎం మిత్ర)' కింద ఎంపిక చేశారు. దేశంలో పీఎం మిత్ర కింద ఎంపికైన ఏడు మెగా టెక్స్‌టైల్ పార్కుల్లో కేఎంటీపీ ఒకటి. బ్రౌన్ ఫీల్డ్ కింద ఈ పార్కు అభివృద్ధికి తొలి విడతగా కేంద్రం రూ.200 కోట్లు కేటాయించిందని అధికారులు చెబుతున్నా అవి ఇంకా విడుదల కాలేదని తెలుస్తోంది. కేంద్రంతో పాటు రాష్ట్ర ప్రభుత్వం సగం నిధులు మంజూరు చేయాల్సి ఉండగా అవేమీ జరగలేదు. పీఎం మిత్ర మెగా టెక్స్‌టైల్ పార్కులు–5 ఎఫ్ (ఫామ్–ఫైబర్–ఫ్యాక్టరీ–ఫ్యాషన్–ఫారిన్) విధానం ద్వారా జౌళి రంగానికి ఊతం ఇస్తాయని కేంద్రం ప్రకటించింది. పార్కులో తమ యూనిట్లను ఏర్పాటు చేసేందుకు ముందుకు వచ్చే కంపెనీలకు అనేక రాయితీలు, ప్రోత్సాహకాలను పీఎం మిత్ర ద్వారా అందించే అవకాశం ఉంది.

గత సర్కారు కేటాయించిన నిధులే...

గత బీఆర్ఎస్ సర్కారు పార్కు అభివృద్ధికి టీఎస్ఐఐసీ ద్వారా రూ. 706.87 కోట్లు మౌలిక వసతుల కల్పనకు ఖర్చు చేసింది. ఇందులో రైతుల భూములను పార్కు కోసం సేకరించినందుకు పరిహారంగా రూ. 159.27 కోట్లు ఖర్చు చేశారు. మిగతా రూ. 547.60 కోట్లను మౌలిక సదుపాయాల కోసం ఖర్చు చేసినట్లు టీఎస్ఐఐసీ అధికారులు తెలిపారు. ఈ నిధులతో 21.50 కి.మీ పొడవులో ప్రహరీ, 13.50 కి.మీ పొడవులో అంతర్గత రోడ్లు, 7.60 కి.మీ పొడవులో వీధి దీపాలు, విద్యుత్ సబ్‌స్టేషన్ల ఏర్పాటు, 12ఎంఎల్‌డీ నీటి సరఫరా, అంతర్గత నీటి సరఫరా, 5 ఎంఎల్‌డీ సీఈటీపీ నిర్మాణం తదితర పనులు చేపట్టారు. అయితే రాష్ట్రంలో కాంగ్రెస్ సర్కారు వచ్చిన తర్వాత పార్కు అభివృద్ధికి నిధులేవీ మంజూరు చేయలేదని తెలుస్తోంది. త్వరలో ప్రవేశపెట్టే రాష్ట్ర బడ్జెట్‌లోనైనా అధికంగా నిధులు పార్కు అభివృద్ధికి కేటాయించాల్సిన అవసరం ఉంది. ఈ క్రమంలో శనివారం సీఎం రేవంత్‌రెడ్డి పార్కు పర్యటనకు వస్తున్న సందర్భంగా ఆయన నిధుల మంజూరు విషయమై ప్రకటన చేసే అవకాశం ఉంది.


పార్కులోని అంతర్గత రోడ్డు

పార్కు ప్రోగ్రెస్ రిపోర్టు ఇలా...

- పార్కు కోసం 1357 ఎకరాల భూ సేకరణ చేపట్టారు.
- పార్కు ఏర్పాటుకు రూ. 1150.47 కోట్లు ఖర్చు అవుతుందని అంచనా
- పరిశ్రమ యూనిట్ల ఏర్పాటుకు 1200 ఎకరాలను లేఔట్ చేశారు.
- అందులో 539.31 ఎకరాలను పరిశ్రమలకు కేటాయించారు.
- గంగదేవిపల్లి నుంచి ఫోర్ లేన్‌తోపాటు చింతలపల్లి రైల్వే స్టేషన సమీపంలో ఆర్ఓబీ నిర్మించాల్సి ఉంది.
- గణేశా ఎకో టెక్ (ప్లాస్టిక్ నుంచి దారం తయారు చేసే) కంపెనీ 50.10 ఎకరాల్లో ఏర్పాటు కాగా రూ. 588.25 కోట్ల పెట్టుబడితో నడుస్తోంది. ఇందులో సుమారు 700 మంది కార్మికులు పని చేస్తున్నారు.
- కైటెక్స్ పిల్లల గార్మెంట్ల తయారీ కంపెనీకి 191.62 ఎకరాల భూమిని కేటాయించగా రూ. 1500 కోట్ల పెట్టుబడి పెట్టనున్నారు. ఇందులో సుమారు 11 వేల మందికి ప్రత్యక్షంగా ఉద్యోగావకాశాలు లభించే అవకాశం ఉండగా ఏర్పాటు పనులు 80 శాతం పూర్తి చేశారు.
- యంగ్‌వన్ ఎవర్‌టాప్ టెక్స్‌టైల్ అండ్ అపెరల్ కాంప్లెక్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ (టీ షర్టులు, ట్రాక్ సూట్‌లు, జర్కిన్లు, క్రీడా దుస్తులు, షూ తదితర తయారు వస్తువులు)కి 297.59 ఎకరాలు కేటాయించగా రూ. 980 కోట్ల పెట్టుబడితో సుమారు 11,700 మందికి ఉద్యోగావకాశాలు కల్పించనున్నారు. ఈ కంపెనీ పనులు కొనసాగుతున్నాయి. మహిళలకు కుట్టు శిక్షణ కోసం ట్రైనింగ్ సెంటర్ ఏర్పాటు చేసి శిక్షణ ఇస్తున్నారు.


టెక్స్‌టైల్ పార్కు బోర్డు

గంజాయి సాగుదారుడికి పదేళ్ల జైలు

వరంగల్ లీగల్/పరకాల : వ్యవసాయ భూమిలో మిశ్రమ పంటగా గంజాయి సాగుచేస్తున్న రైతుకు పదేళ్ల జైలు శిక్ష విధిస్తూ హనుమకొండ మొదటి అదనపు జిల్లా కోర్టు జడ్జి బి. అపర్ణాదేవి గురువారం తీర్పు వెల్లడించారు. హనుమకొండ జిల్లా పరకాల మండలం కామారెడ్డిపల్లికి చెందిన గొట్టె కుమారస్వామి పోచార గ్రామ శివారులో గల తన వ్యవసాయ భూమిలో గంజాయి సాగుచేస్తున్నారని ఎస్సై శ్రీకాంత్ రెడ్డికి సమాచారం అందింది. వెంటనే ఉన్నతాధికారులతోపాటు తహసీల్దార్‌కు సమాచారం అందజేసి తన సిబ్బందితో గంజాయి సాగు చేస్తున్న పంట భూమి వద్దకు వెళ్లాడు. రెవెన్యూ సిబ్బంది చేరుకుని భూమిని పరిశీలించి గొట్టె కుమారస్వామి భూమి అని తేల్చి చెప్పారు. పత్తి చేనులో మిశ్రమ పంటగా గంజాయి మొక్కలు పెరిగి ఉన్నాయని గుర్తించారు. పంచుల సమక్షంలో ఏపుగా పెరిగిన గంజాయి మొక్కలను సేకరించి పరీక్ష నిమిత్తం ల్యాబ్‌కు పంపించారు. అనంతరం గంజాయి మొక్కలను తొలగించారు. సదర్ ఎస్సై ఫిర్యాదు మేరకు ఇన్‌స్పెక్టర్ కేసు నమోదు చేసి నిందితుడిని అరెస్ట్ చేశారు. విచారణలో సాక్ష్యాధారాలను పరిశీలించిన కోర్టు.. నేరం రుజువు కావడంతో నేరస్తుడు గొట్టె కుమారస్వామికి పదేళ్ల జైలు శిక్ష, రూ. 10 వేల జరిమానా విధిస్తూ జడ్జి తీర్పు వెల్లడించారు. ఈ కేసును పోలీసు అధికారులు జే నర్సింహులు, రవిరాజ్ పరిశోధించగా సాక్షులను కే పరమేశ్వరి పర్యవేక్షణలో కానిస్టేబుల్ ఎస్. సుధాకర్ కోర్టులో ప్రవేశపెట్టారు. పీపీ బి. రాజమల్లారెడ్డి కేసు వాదించారు.

ప్రేమ నిరాకరించిందని యువకుడి ఆత్మహత్య


రాజశేఖర్(ఫైల్)

పరకాల: ప్రేమించిన యువతిని పెళ్లి చేసుకోవడానికి పెద్దలు నిరాకరించడంతో మనస్తాపం చెందిన ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన గురువారం పరకాల మండలం పైడిపల్లిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన కొండి రాజశేఖర్(23) అదే గ్రామానికి చెందిన ఓ యువతిని ప్రేమిస్తున్నాడు. ఈ విషయం తెలియడంతో గ్రామంలోని ఇరువర్గాల పెద్దలు మందలించి మరోసారి ఆ యువతి జోలికి రాజశేఖర్ వెళ్లొద్దని నిర్ణయించారు. దీనిపై మనస్తాపం చెందిన రాజశేఖర్.. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పనికోసం బయటకు వెళ్లి వచ్చిన తల్లి మంజుల ఇంటి తలుపులు తీసే క్రమంలో రాకపోవడంతో అనుమానంతో కిటికీ నుంచి చూడగా కొడుకు ఉరేసుకుని కనిపించాడు. దీంతో కేకలు వేస్తూ ఇంటి పక్కనవారికి తెలపడంతో బలవంతంగా తలుపులు తొలగించి చూడగా రాజశేఖర్ అప్పటికే ప్రాణం కోల్పోయాడు. ఈ ఘటనపై మృతుడి తండ్రి వెంకన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పరకాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు సీఐ రవిరాజ్ తెలిపారు.

పోక్సో కేసులో ఇద్దరికి మూడేళ్ల జైలు

వరంగల్ లీగల్: 'ప్రేమిస్తున్నాం.. పెళ్లి చేసుకోవాలి' అని తరచూ బెదిరిస్తూ మైనర్లు అయిన అక్కాచెల్లెలను ఎత్తుకెళ్లిన కేసులో నేరం రుజువుకావడంతో హనుమకొండ బొక్కల గడ్డకు చెందిన సోనుసింగ్ బాటియా, ఎండీ సమీర్‌కు మూడేళ్ల జైలు శిక్ష, రూ. 2 వేల చొప్పున జరిమానా విధిస్తూ జడ్జి అపర్ణాదేవి గురువారం తీర్పు ఇచ్చారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ బోడెడ్ల రాజమల్లారెడ్డి కథనం ప్రకారం.. హనుమకొండ గుండ్ల సింగారం గ్రామానికి చెందిన అక్కాచెల్లెలో ఒకరు ఇంటర్, మరొకరు పదో తరగతి చదువుతున్నారు. తమ స్నేహితురాలి జన్మదిన వేడుకల్లో ఆమె అన్నయ్య (సోనుసింగ్), మరో వ్యక్తి (సమీర్).. సదరు అక్కాచెల్లెలకు పరిచయమయ్యారు. అనంతరం ప్రేమిస్తున్నామని.. పెళ్లి చేసుకుంటామని లైంగిక వేధింపులకు గురిచేశారు. ఈక్రమంలో 2019 జనవరి 1న తమ నానమ్మతో కలిసి ఫొటో దిగడానికి అక్కాచెల్లెలు పెగడపల్లి డబ్బాల సమీపాన గల ఓ ఫొటో స్టూడియోకు వెళ్లారు. అక్కడ అక్కాచెల్లెలను గమనించిన ఇద్దరు నిందితులు 'నీ స్నేహితురాలు పిలుస్తుంది' అని మాయమాటలు చెప్పి ఆటలో తీసుకుని పారిపోయారు. తమను ప్రేమించాలని దాడి చేస్తూ నగరం మొత్తం తిప్పి చివరకు ఇంటికి వెళ్లండని ఓ ప్రాంతంలో దింపారు. దీంతో అక్కాచెల్లెలు అక్కడి నుంచి నేరుగా గుండ్లసింగారం బొడ్రాయి వద్దకు చేరుకోగా నిందితులు వారి వెనుక వెళ్లి బాలికలను కొట్టారు. ఈ ఘటనలో చెల్లి స్పృహ తప్పి పడిపోగా .. అక్క కేకలు వేసింది. దీంతో నిందితులు పారిపోయారు. అనంతరం బాలికలు తెలిసిన వ్యక్తికి ఫోన్ చేయగా ఆయన ద్వారా సమాచారం తెలుసుకున్న బాధిత బాలికల తండ్రి ఘటనాస్థలికి చేరుకుని కుమార్తెలను ఇంటికి తీసుకెళ్లారు. అనంతరం పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి నిందితులను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచారు. సాక్ష్యాధారాలను విచారించిన కోర్టు.. నేరం రుజువు కావడంతో నేరస్తులు సోనుసింగ్ బాటియా, ఎండీ సమీర్‌కు 3 సంత్సరాల జైలు శిక్ష, రూ. 2 వేల చొప్పున జరిమానా విధిస్తూ జడ్జి అపర్ణాదేవి తీర్పునిచ్చారు. అప్పటి హనుమకొండ ఏసీపీ డి. చంద్రయ్య, కేయూ ప్రస్తుత సీఐ సంజీవ్ కేసు పరిశోధించారు. మహిళా ఏఎస్సై పరమేశ్వరి, భరోసా కేంద్రం లీగల్ ఆఫీసర్ సీహెచ్ నిరజ పర్యవేక్షణలో కే.రాజేందర్, డి. భాస్కర్ సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టారు.

'గ్రేటర్'కు కొత్త మాస్టర్‌ప్లాన్

కార్పొరేషన్ కార్యాలయానికి నూతన భవనం

- సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి జిల్లా సమస్యలు
- అటవీ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ

దయాకర్‌రావు రాడు..రానివ్వం..

విలేకరుల సమావేశంలో మంత్రి సురేఖ మాట్లాడుతూ మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు కాంగ్రెస్ పార్టీలోకి వచ్చే అవకాశం లేదని, ఒకవేళ ప్రయత్నం చేసినా తాము రానివ్వబోమని తెలిపారు. సమావేశంలో పలువురు విలేకరులు ఎర్రబెల్లి కాంగ్రెస్ పార్టీలో చేరికపై అడిగిన ప్రశ్నలకు ఆమె పై విధంగా సమాధానం ఇచ్చారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కూడా ఈ విషయంలో స్పష్టంగా ఉన్నారని, మిగతా వారి విషయం వేరు.. దయాకర్‌రావు విషయం వేరని చెప్పుకొచ్చారు.

హన్మకొండ అర్బన్: బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రూపొందించిన గ్రేటర్ వరంగల్ మాస్టర్‌ప్లాన్‌తో సామాన్య ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని రాష్ట్ర అటవీ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. అభివృద్ధికి ఆటంకంగా మారుతున్నందున గ్రేటర్ సమగ్ర అభివృద్ధికి సర్వే చేయించి కొత్త మాస్టర్‌ప్లాన్ సిద్ధం చేస్తామని ఆమె పేర్కొన్నారు. ముఖ్యమంత్రి పర్యటన వివరాలు, ఆయన దృష్టికి తీసుకురానున్న ముఖ్య సమస్యలపై మేయర్ గుండు సుధారాణి, ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్ రెడ్డి, కేఆర్ నాగరాజుతో కలిసి హనుమకొండ కలెక్టరేట్‌లో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. గత ప్రభుత్వ పెద్దలు గ్రేటర్ వరంగల్ మాస్టర్ ప్లాన్‌ను అడ్డగోలుగా చేశారని విమర్శించారు. అందుకే రీ సర్వే చేయించి అందరికీ ఆమోద యోగ్యమైన మాస్టర్‌ప్లాన్ సిద్ధం చేస్తామని స్పష్టం చేశారు. పర్యటనలో భాగంగా సీఎం సూపర్‌స్పెషాలిటీ హాస్పిటల్ పనులు పరిశీలిస్తారని తెలిపారు. 12 అంతస్తుల వరకే ఆస్పత్రి ఉండాలని నిబంధనలు చెబుతున్నాయని, మిగిలిన భవనం అంతస్తులు ఏ విధంగా ఉపయోగించాలనే విషయం సీఎంతో చర్చిస్తామని తెలిపారు. జిల్లాలో ఆయుర్వేద కళాశాల, బస్టాండ్ అభివృద్ధికి నిధులు, హైదరాబాద్–వరంగల్ ఇండస్ట్రియల్ కారిడార్ ఏర్పాటు వంటి అంశాలు సీఎంకు వివరిస్తామని చెప్పారు. ఇన్నర్, ఔటర్ రింగ్‌రోడ్ల నిర్మాణంలో జరిగిన అక్రమాలను సరిదిద్దేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. కొన్నిచోట్ల పరిహారం చెల్లింపులో జరిగిన అక్రమాలపై విచారణ చేయిస్తామని తెలిపారు. పర్యాటకరంగం అభివృద్ధికి ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు చెప్పారు. ఇందిర మహిళాశక్తి కార్యక్రమంలో భాగంగా సీఎం చేతుల మీదుగా మహిళలకు రూ.20 కోట్ల చెక్కు అందజేస్తామని మంత్రి సురేఖ తెలిపారు.


మాట్లాడుతున్న మంత్రి సురేఖ, పక్కన మేయర్ సుధారాణి, ఎమ్మెల్యేలు నాయిని, నాగరాజు

మంత్రి మాట్లాడుతుండగా కరెంట్ కట్

సీఎం రేవంత్‌రెడ్డి వరంగల్ పర్యటన నేపథ్యంలో ఏర్పాట్లు వివరించేందుకు గురువారం సాయంత్రం హనుమకొండ కలెక్టరేట్‌లో రాష్ట్ర మంత్రి కొండా సురేఖ విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ క్రమంలో మంత్రి మాట్లాడుతుండగా రెండు సార్లు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. ఈ విషయంలో సాయంత్రం విద్యుత్ అధికారులు మంత్రిని కలిసి వివరణ ఇవ్వడంతోపాటు ప్రకటన విడుదల చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన నేపథ్యంలో టెస్టింగ్ చేస్తుండగా అంతరాయం ఏర్పడిందని, ఎలాంటి పవర్‌కట్ లేదని తెలిపారు.

కారు ఢీకొని స్కూల్ బస్సు బోల్తా


ఘటనా స్థలంలో బోల్తా పడిన స్కూల్ బస్సు, పక్కన నుజ్జునుజ్జయిన కారు


గాయపడిన విద్యార్థిని తమ వాహనంలో ఆస్పత్రికి తరలిస్తున్న పోలీసులు


ఘటనాస్థలిలో గుమిగూడిన ప్రజలను పంపిస్తున్న పోలీసులు

- ప్రమాద సమయంలో బస్సులో 30మంది విద్యార్థులు
- ముగ్గురు విద్యార్థులకు స్వల్ప గాయాలు
- కారులో ప్రయాణిస్తున్న ఒకరి మృతి, మరొకరి పరిస్థితి విషమం

కమలాపూర్: అతివేగంగా వస్తున్న ఓ కారు ఢీకొని స్కూల్ బస్సు బోల్తా పడింది. ఈ ఘటన హనుమకొండ జిల్లా కమలాపూర్‌లో పరకాల–హుజూరాబాద్ ప్రధాన రహదారిపై చోటు చేసుకుంది. సీఐ హరికృష్ణ, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. హసన్‌పర్తి మండలం పెంబర్తిలోని ఏకశిల స్కూల్‌కు చెందిన బస్సు పాఠశాల ముగిశాక గురువారం సాయంత్రం విద్యార్థులను ఇళ్ల వద్ద దింపడానికి బయలు దేరింది. కమలాపూర్ మండలంలోని కన్నూరు, రాములపల్లి, భీంపల్లి గ్రామాలకు వెళ్తోంది. ఈక్రమంలో కమలాపూర్ శివారులోని ఉమామహేశ్వర ఫంక్షన్ హాల్ వద్ద కన్నూరుకు వెళ్లేందుకు యూటర్న్ తీసుకుంటోంది. ఈ క్రమంలో బస్సు వెనకాలే అతివేగంగా వస్తున్న కారు ఢీకొంది. దీంతో స్కూల్ బస్సు బోల్తా పడగా కారు నుజ్జునుజ్జయింది. ప్రమాద సమయంలో స్కూల్ బస్సులో కన్నూరు, రాములపల్లి, భీంపల్లి గ్రామాలకు చెందిన 30మంది విద్యార్థులు ఉన్నారు. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు అద్దాలు పగులగొట్టి విద్యార్థులను బస్సులోంచి కిందకు దింపేశారు. ఈ ప్రమాదంలో స్కూల్ బస్సులోని ముగ్గురు విద్యార్థులకు స్వల్ప గాయాలు, కారులో ప్రయాణిస్తున్న హుజూరాబాద్‌కు చెందిన ఎండీ.అబ్దుల్, భవానందస్వామి, కరీంనగర్‌కు చెందిన సంతోష్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ఈ ప్రమాదంపై సమాచారం అందుకున్న సీఐ హరికృష్ణ, ఎస్సై వీరభద్రరావు సిబ్బందితో కలిసి ఘటనా స్థలానికి చేరుకుని విద్యార్థులను పోలీస్ వాహనంలో, తీవ్ర గాయాలైన క్షతగాత్రులను 108 అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించారు. అనంతరం క్రేన్ సాయంతో కారు, స్కూల్ బస్సును రోడ్డుపై నుంచి తొలగించి ట్రాఫిక్ క్లియర్ చేశారు. కారు కరీంనగర్ జిల్లా సైదాపూర్ మండలం బొర్నపల్లికి చెందినదిగా పోలీసులు గుర్తించారు. అయితే, కారులో ప్రయాణిస్తూ తీవ్రంగా గాయపడిన ఎండీ.అబ్దుల్ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందగా.. అపస్మారక స్థితిలో ఉన్న సంతోష్ పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. కాగా, ఈ ప్రమాదంలో విద్యార్థులకు ప్రాణాపాయం తప్పడంతో తల్లిదండ్రులు, బంధువులు, గ్రామస్తులు ఊపిరి పీల్చుకున్నారు.

భార్యను చంపిన భర్త అరెస్ట్

భూపాలపల్లి అర్బన్ : భార్యను హత్య చేసిన భర్తను అరెస్ట్ చేసినట్లు సీఐ నరేశ్‌కుమార్ తెలిపారు. సీఐ కథనం ప్రకారం.. నాలుగు రోజుల క్రితం ఫకీర్‌గడ్డ సమీపంలోని ఆకుదారివాడకు చెందిన ఇస్లావత్ సుమతిని తన భర్త హతిరామ్ హత్య చేసి తప్పించుకునే ప్రయత్నం చేశాడు. సుమతిపై ఉన్న బంగారాన్ని బాత్రూం పక్కన గోతి తీసి అందులో దాచిపెట్టి, గుర్తు తెలియ వ్యక్తులు వచ్చి తన భార్యను చంపినట్లు హతిరామ్ తెలిపాడు. దీనిపై మృతురాలి తల్లిదండ్రులు ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టగా హతిరామే.. భార్యను చున్నిని మెడకు బిగించి హత్య చేసినట్లు వెల్లడైందన్నారు. దీంతో హతిరామ్‌పై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపర్చామని సీఐ నరేశ్‌కుమార్ తెలిపారు.